

కల సాకారం
వైద్య రంగంలో అడుగు పెట్టాలని కలలు కన్న వందలాది మంది విద్యార్థులు సాకారం చేసుకుని.. బుధవారం వైద్య విద్య పట్టాలు అందుకోనున్నారు. -8లో



డీసీసీ బ్యాంక్ మెరుగైన సేవలు
ఖాతాదారులకు డీసీసీ బ్యాంకు మెరుగైన సేవలు అందిస్తోందని డీసీసీ, ఆప్కాబ్ బ్యాంక్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
26.8/22.5

వాతావరణం
జిల్లాలో మంగళవారం 22.5 -26.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్


ఐదు మండలాల్లో వర్షం
కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలోని ఐదు మండలాల్లో కొద్దిపాటి వర్షం కురిసింది. వేముల మండలంలో 4.2 మిల్లీమీటర్లు, పులివెందుల 2.2, పెండ్లిమర్రి 1.2, చక్రాయపేట 1, వీఎన్‌పల్లెలో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

13 నుంచి వైవీయూకు సంక్రాంతి సెలవులు
వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య తెలిపారు. జీసీటీఏ, జీసీజీటీఏ సంఘాల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 21వ తేదీ ఆదివారం అయినందున, తిరిగి 22వ తేదీ తరగతులు పునఃప్రారంభమవుతాయన్నారు.

పీహెచ్‌ఎన్ పదోన్నతుల కౌన్సెలింగ్
కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (రాయలసీమ జిల్లాలు) జోన్-4 పరిధిలో మంగళవారం స్టాఫ్‌నర్స్ నుంచి పీహెచ్ఎన్ టీచింగ్ పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 31 మందికి గాను 21 మంది హాజరై పదోన్నతులు పొందారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పదోన్నతులు కల్పించినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య, వనీష తదితరులు పాల్గొన్నారు.

ఏఈఎంఎస్ 104లో ఉద్యోగ అవకాశాలు
కడప రూరల్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ (ఏఈఎంఎస్) 104లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆ సంస్థ మేనేజర్ సుబ్బయ్య తెలిపారు. డ్రైవర్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై హెవీ లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు విద్యార్హత డిగ్రీ, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ ఉద్యోగాలకు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను కడప పాత రిమ్స్‌లోని కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9642535104ను సంప్రదించాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో విధులు చేపట్టాల్సి ఉంటుందని వివరించారు.

బీబీఏ ఏపీలో జిల్లా వాసులకు అగ్రస్థానం
కడప స్పోర్ట్స్: బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (బీబీఏ ఏపీ) నూతన కార్యవర్గంలో ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాకు కీలక పదవులు దక్కాయి. విజయవాడలో సోమవారం అసోసియేషన్ ఆవిర్భావ ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. బీబీఏ ఏపీ చైర్మన్‌గా ఇంటూరి యశోదానంద కుమార్ (కడప), అధ్యక్షుడిగా నూనె నాగేష్ (కడప), ప్రధాన కార్యదర్శిగా ఎస్.యూనుస్‌బాషా (కడప)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు జిల్లాకు చెందిన మరి కొందరికి కీలకమైన పదవులు లభించాయి. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎస్.రషీద్ (కడప), సంయుక్త కార్యదర్శులుగా ఖలందర్ (కడప), గిరిధర్ (అన్నమయ్య), జడ్జిల కమిటీ సభ్యులుగా ఫయాజ్, మస్తాన్ (అన్నమయ్య), ఇ.సి.మెంబర్లుగా మెహరాజ్ (కడప), హఫీజ్ (అన్నమయ్య)లను ఎన్నుకున్నారు.

సిద్దవటం సీతారామయ్య కన్నుమూత


కడప కల్చరల్: జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి విశేష కృషి చేసిన సిద్దవటం సీతారామయ్య (94) బెంగళూరులోని తన కుమారుల ఇంటిలో మంగళవారం ఉదయం కన్నుమూశారు. మధ్యాహ్నం బెంగళూరులోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కడప శ్రీరామకృష్ణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలు అందించిన ఆయన 42 ఏళ్లపాటు వేలాది మందికి స్పోకెన్ ఇంగ్లిషు, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఇచ్చారు. కడప నగర అభివృద్ధి కోసం 35 ఏళ్ల క్రితం సిటీ సిటిజన్స్ ఫోరం ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల క్రితం ఇంటాక్ జిల్లా కన్వీనర్‌గా ఈ ప్రాంతంలోని ఎన్నో కోటలు, ఆలయాలు తదితర వారసత్వ సంపద రక్షణకు సహచరులతో కలిసి కృషి చేశారు. గండికోట అభివృద్ధి, రాజంపేటలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహం ఏర్పాటు, ఒంటిమిట్ట రామాలయానికి ప్రభుత్వ హోదా దక్కడంలో ఈయన కృషి ఎంతో ఉంది. జిల్లా పర్యాటక రంగంపై 30కి పైగా పుస్తకాలు రాశారు. ఆయన మృతి పట్ల ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి, లయన్స్ జిల్లా అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, రాయలసీమ టూరిజం సంస్థ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, పర్యాటక రంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

పండక్కి.. బస్సెక్కి..

- అదనపు బాదుడు నుంచి విముక్తి
- సంక్రాంతికి 195 ప్రత్యేక బస్సులు
- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు సర్వీసులు
- రానుపోను రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ
- నేటి నుంచి రాకపోకలు



కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగకు ప్రయాణం చేయాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేవారు. ఎందుకంటే ప్రైవేటు ట్రావెల్స్‌తో పాటు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసి, చార్జీలు భారీగా పెంచేది. మరోవైపు రైళ్లలో కూడా టిక్కెట్లు లభించేవి కావు. దీంతో పండుగ ప్రయాణం భారంగా మారేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తూ.. ఎలాంటి ఆర్థిక భారం మోపకుండా సాధారణ చార్జీలతోనే నడుపుతున్నారు. ప్రస్తుతం జిల్లా నుంచి 195 ప్రత్యేక సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడపనున్నారు.

విద్య, ఉద్యోగం, వ్యాపార, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సంక్రాంతి, దసరాలకు స్వగ్రామాలకు వెళ్లాలని ఉవ్విళ్లూరుతుంటారు. ఏ పండుగ వచ్చినా, రాకున్నా సంక్రాంతికి మాత్రం స్వగ్రామానికి చేరుకుని చిన్ననాటి స్నేహితులు, బంధువులతో సరదాగా గడపాలనే ఉద్దేశంతో ఒక మంచి అభిప్రాయం, సంప్రదాయం దృష్టిలో ఉంచుకుని వచ్చేవారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. గత ప్రభుత్వ హయాంలో అయితే ప్రత్యేక బస్సుల్లో చార్జీలు 50 శాతం అదనంగా పెంచేవారు. ప్రైవే టు ట్రావెల్స్ రెండు, మూడు రెట్లు పెంచి ప్రయాణికులపై ఆర్థిక భారం మోపేవారు. ఇక రైళ్లలో ప్రయాణించాలంటే వెయిటింగ్ లిస్టు చాంతాడంతగా ఉండేది. గత్యంతరం లేని పరిస్థితుల్లో బస్సు ల్లో అదనపు చార్జీల భారాన్ని మోస్తూ సొంత ఊర్లకు వెళ్లేవారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 50 శాతం అదనపు బాదుడు నుంచి విముక్తి కల్పించారు. పండుగకు వెళ్లే ప్రతి ఒక్కరూ సొంత గ్రామాలకు సంతోషంగా చేరుకోవాలనే ఉద్దేశంతో ఈ అవకాశాన్ని కల్పించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

195 ప్రత్యేక బస్సులు
జిల్లాలో కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోలు ఉన్నాయి. ఈ నెల 10వ తేదీ నుంచి స్పెషల్ బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. వీటిలో విజయవాడకు 25, హైదరాబాదుకు 96, బెంగళూరు 60, చెన్నై 14, ఇతర ప్రాంతాలకు 58 బస్సులను నడపనున్నారు. ఈ బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యంతోపాటు అదనపు చార్జీల భారాన్ని తప్పించారు. ప్రయాణికులకు చిల్లర సమస్య లేకుండా ఫోన్, గుగూల్ పేలు, క్యూఆర్ కోడ్ స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. అలాగే ఒకేసారి టిక్కెట్ రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీని కల్పిస్తున్నారు.

11, 12 తేదీల్లో అత్యధిక సర్వీసులు


సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీన 46 బస్సులు, 12న 64 బస్సులను వివిధ నగరాలకు నడపనున్నాం. ఇవే కాకుండా అవసరమైతే అదనపు సర్వీసులు కూడా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రయాణికులకు నగదు రహిత లావాదేవీల ద్వారా టిక్కెట్ చెల్లించేందుకు అవకాశం కల్పించాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

ప్రజా సంకల్పయాత్ర చరిత్రలో నిలిచిపోతుంది

కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రజల కష్ట నష్టాలను తెలుసుకోవడానికి ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కమలాపురం శాసనసభ్యుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ముగిసి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని ఒంటి చేత్తో అధికారంలోకి తెచ్చాడని, పాదయాత్రలో ఇచ్చిన హామీలనే గాక ఇవ్వని వాటిని కూడా అమలు చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలకు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు తూట్లు పొడవడంతో.. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూడలేక ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేపట్టారని తెలిపారు. 341 రోజుల పాటు 3648 కి.మీలు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం అమలు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని విధాలుగా మేలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అహమ్మద్ బాషా, పి.జయచంద్రారెడ్డి, బాల స్వామిరెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, బండి ప్రసాద్, టీపీ వెంకట సుబ్బమ్మ, సంధ్యారాణి, పత్తిరాజేశ్వరి, నారాయణమ్మ, బండి మరియ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్థాయి సంఘాల సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడినందువల్ల భూగర్భ జలాలు అడుగంటడంతో వేసవిలో చాలా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సీపీడబ్ల్యూఎస్ పథకాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. అవసరమైన చోట్ల తాగునీటి రవాణా, వ్యవసాయ బావులు అద్దెకు తీసుకోవడం, డీపెనింగ్ ఆఫ్ బోర్‌వెల్స్ వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి రవాణా బిల్లులు అన్నీ చెల్లించామని తెలిపారు. భూగర్భ జలాలు చాలా లోతులో ఉండడం వల్ల హ్యాండ్ పంపులు పని చేయవని తెలిపారు. నదీ పరివాహక ప్రాంత గ్రామాల్లో అవసరమైతే హ్యాండ్ పంపులు ఏర్పాటు చేసే వీలుంటుందని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. జిల్లాలో జగనన్న కాలనీలు, సామాన్య ప్రజల ఇతర అవసరాలకు ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. జిల్లాలో 2200 పనులను రూ.100 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు చేపట్టారని తెలిపారు. అనంతరం పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, బి.కోడూరు జెడ్పీటీసీ దావీదు, జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి తమ ప్రాంతాల్లోని సమస్యలను ప్రస్తావించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ ఉపాధ్యక్షులు బాలయ్య, సీఈఓ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ధనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ప్రణాళికల తయారీపై ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లకు మంగళవారం నుంచి డీపీఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు సొంతంగా వచ్చే గ్రాంట్లు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు, ఆరోగ్యం, బాలల స్నేహ పూర్వక, సమృద్ధిగా నీరు ఉండే, పరిశుభ్రత-హరిత గ్రామాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డీఎల్‌పీఓలు మస్తాన్ వలీ, భాస్కర్, రమణారెడ్డి, రమాదేవి, రీసోర్స్ పర్సన్ దేవేందర్‌రెడ్డి, ఆమోస్, రాఘవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ ఉద్యోగిని వ్యవహారంపై విచారణ
కడప అర్బన్: కడప నగరం అప్సరా కూడలి సమీపంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్న మహిళా ఉద్యోగి సౌజన్య వ్యవహారంపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టారు. ఆమె ఎంత మంది దగ్గర బంగారు ఆభరణాలను తీసుకుని తమ సంస్థలో తాకట్టు పెట్టింది? ఏ మొత్తంలో వడ్డీలకు ఆశచూపి ఎలా మాయ చేసిందో తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో ఆమెను అదుపులోకి తీసుకుని విచారణ చేయనున్నట్లు సమాచారం.

దళారులను నమ్మి మోసపోవద్దు
కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని మహిళా శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్స్, మినీ వర్కర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీలో అభ్యర్థులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది దళారులు పోస్టులు ఇప్పిస్తామని ఆశలు చూపి డబ్బులు తీసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దళారులపై చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

ఉపాధికి ప్రణాళిక

- 2024-25కు పనుల గుర్తింపునకు కసరత్తు
- పనిదినాలు 99,77,000గా చేయాలని లక్ష్యం
- కూలీల వేతనాలకు రూ.271.37 కోట్లు
- సామగ్రి కోసం రూ.180.90 కోట్లు
- మొత్తం ఖర్చు రూ.452.27 కోట్ల అంచనా


ఉపాధి పని చేస్తున్న కూలీలు (ఫైల్)

కడప సిటీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి పనుల నిర్వహణకు జిల్లాలో కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పనుల గుర్తింపులో సిబ్బంది నిమగ్నమయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి 31 నాటికి గడువు ముగుస్తుంది. ఆ తర్వాత 2024-25కు పనుల నిర్వహణ కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. అందులో భాగంగానే జిల్లాలోని ఉపాధి సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేసి చేపట్టనున్నారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలను బట్టి పనులను గుర్తించి అందుకు సంబంధించిన పని దినాలతోపాటు పలు నిర్మాణాత్మక పనులను చేపట్టేందుకు ఏ మేరకు నిధులు అవసరమవుతాయో అంచనా వేసుకుని నివేదికలను సంబంధిత శాఖకు అందజేయడం జరుగుతుంది.


మొత్తం పనిదినాలు
2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 99,77,000 పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. ఇందుకు వేతన ఖర్చుల కోసం రూ.271.37 కోట్లు వెచ్చించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 73 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా, 69,64,000 పనిదినాలు ఇప్పటి వరకు కల్పించడం జరిగింది. వచ్చే మార్చి నాటికి లక్ష్యాన్ని ఛేదించేందుకు సిబ్బంది పని చేస్తున్నారు.

సామగ్రి కోసం..
సామగ్రికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.180.90 కోట్లు ఖర్చు పెట్టాలని నిర్ణయించారు. ఈ మొత్తంతో మినీ అంగన్వాడీ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, సిమెంటు రోడ్లు తదితర నిర్మాణాత్మక పనులను చేపడతారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మెటీరియల్‌కు రూ.16.32 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.255.22 కోట్లు మొత్తం బడ్జెట్ కాగా, 2024-25 సంవత్సరానికి ఈ మొత్తం రూ.452.27 కోట్ల అంచనాకు చేరింది.

చేపట్టే పనులు
ఉపాధి హామీలో ప్రధానంగా చెరువుల పునరుద్ధరణ (అమృత్ సరోవర్), కొత్త చెరువుల నిర్మాణం, మినీ అమృత్ సరోవర్లు, పర్కులేషన్ ట్యాంకులు, పర్కులేషన్ పాండ్స్, నీటి కందకాలు, బండింగ్ ప్లాంటేషన్, హార్టికల్చర్, మునగ సాగు, అవెన్యూ ప్లాంటేషన్, బోడిగుట్టలపై పచ్చదనం పెంపు, కోనేరులు, పశువుల షెడ్లు, కాలువల మరమ్మతు తదితర పనులు చేపడతారు. ప్లానింగ్ ప్రాసెస్ ద్వారా కొత్త పనులను గుర్తించడం జరుగుతుంది.

ప్లాంటేషన్లు ఇలా..
2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి ప్లాంటేషన్‌లో భాగంగా పండ్ల తోటల పెంపకానికి సంబంధించి 2736 ఎకరాలు, బండ్ ప్లాంటేషన్ కింద 187 ఎకరాలు, మునగ సాగు కింద 21 ఎకరాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం 23 కిలోమీటర్లు, బ్లాక్ ప్లాంటేషన్ కింద 23 ఎకరాలు, ప్రభుత్వ సంస్థల ఆవరణాలకు సంబంధించి 2409 మొక్కలు నాటడం జరిగింది.

రాష్ట్రంలో ఐదో స్థానం
వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలో 90 శాతం ఉపాధి హామీ పనులతో ప్రగతి సాధించి ఐదో స్థానంలో ఉంది. 1,97,848 జాబ్‌కార్డులు ఉండగా, ఇందులో 3,32,867 మంది కూలీలు ఉన్నారు. 73 లక్షల పనిదినాల లక్ష్యానికి ఇప్పటి వరకు 1,42,000 మందికి 822 కుటుంబాల్లోని 2,27,092 మంది కూలీలకు పని కల్పించారు. మొత్తం 69,64,000 పనిదినాలు ఇప్పటి వరకు కల్పించడం జరిగింది. దీంతో 95 శాతం ప్రగతి సాధించి రాష్ట్రంలో జిల్లా ఐదో స్థానంలో ఉంది.

లక్ష్యం చేరుకోవడానికి కృషి


2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీలో పనులు గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఒక అంచనాకు రాగా, పూర్తి నివేదికలు అందాక మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ మార్చి చివరి నాటికి లక్ష్యాన్ని చేరుకోవడానికి క్షేత్ర స్థాయిలో అన్ని చర్యలు చేపడుతున్నాం. – పి.యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని కడప-రాజంపేట బైపాస్ రోడ్డులో ఈనెల 8వ తేదీన మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇరువురిని వెనుక వైపు నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో శ్రీధర్ (47) అనే వ్యక్తి మృతి చెందాడు. ప్రొద్దుటూరు రుద్రవరానికి చెందిన శ్రీధర్ గత కొంతకాలంగా తిప్పిరెడ్డిపల్లెలో ఉంటూ మైదుకూరు సైకిల్‌షాపులో పనిచేస్తున్నాడు. ఈనెల 8వ తేదీన తన గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తితో కలిసి మోటార్ సైకిల్‌లో తిరుమల దైవ దర్శనానికి బయలుదేరారు. కడప నగర శివార్లలో వెనుకవైపుగా మహారాష్ట్రకు చెందిన లారీ వచ్చి ఢీకొనడంతో శ్రీధర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్ మంగళవారం కేసు నమోదు చేశారు.

పంది అడ్డురావడంతో..


మృతుడు బాలుడు

పోరుమామిళ్ల : మండలంలోని ఎస్. వెంక్రటామాపురానికి చెందిన తాళ్ల బాలుడు(36) సోమవారం రాత్రి కొండుగారిపల్లె వద్ద పంది అడ్డు రావడంతో మోటార్‌బైక్‌పై నుంచి కింద పడి మృతి చెందాడు. అత్తగారింటికి కొట్టాలపల్లె వెళ్లి ఇంటికి తిరిగి వెళుతుండగా పంది అడ్డం రావడంతో సడన్‌గా బ్రేక్ వేసి ఎగిరి కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో పోరుమామిళ్ల ఆసుపత్రికి తెచ్చే సరికే మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. అతని వెంట అన్న కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయన్నారు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు చిన్న పిల్లలున్నారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సైకిల్‌ను ఢీకొన్న బుల్లెట్ వాహనం

– ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు


రమేష్ (ఫైల్)

చింతకొమ్మదిన్నె : కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని కేఎస్ఆర్ఎం కళాశాల సమీపంలో గల స్పిన్నింగ్ మిల్లు వద్ద సోమవారం రాత్రి బుల్లెట్ వాహనం సైకిల్ ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. సీకే దిన్నె ఎస్ఐ బి. శ్రీనివాసులరెడ్డి తెలిపిన వివరాల మేరకు పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లి గ్రామానికి చెందిన రమేష్,వెంకటసుబ్బయ్యలు కడప నగరంలో తమ పనులను ముగించుకొని సోమవారం రాత్రి తిరిగి తమ గ్రామానికి బుల్లెట్ వాహనంపై బయలుదేరారు. స్పిన్నింగ్ మిల్లు వద్దకు రాగానే సైకిల్ ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బుల్లెట్ వాహనాన్ని నడుపుతున్న రమేష్ (24) అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం వెనుక కూర్చున్న వెంకటసుబ్బయ్యతో పాటు, సైకిల్‌పై వెళుతున్న శ్రీరాముడుకు గాయాలయ్యాయి. వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కలలు కన్నారు..
సాకారం చేసుకున్నారు

- నేడు 2018 బ్యాచ్ ప్రభుత్వ దంత వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం
- సర్వతోముఖాభివృద్ధి దిశగా 'కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాల'
- ప్రతి రోజూ 100 నుంచి 150 మందికి దంతవైద్య పరీక్షలు


కడప నగరంలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాల


దంతవైద్య సేవలో విద్యార్థులు (ఫైల్)

కడప అర్బన్ : కడప రిమ్స్ ఆవరణంలో 2008-09 విద్యా సంవత్సరంలో 100 సీట్లతో 'ప్రభుత్వ దంత వైద్య కళాశాల'ను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్థాపించారు. 2009 జనవరిలో ఈ కళాశాల భవన సముదాయాన్ని వైఎస్సార్ ప్రారంభించగా 2008-09 బ్యాచ్‌లో 100 మంది విద్యార్థులకు అవకాశం లభించింది. భారతీయ దంతవైద్య విద్యామండలి (డీసీఐ) వారు 2013లో గుర్తింపు ఇచ్చారు. 2008-09 విద్యాసంవత్సరం నుంచి ఇప్పటివరకు 16 బ్యాచ్‌ల్లో 1563 మంది దంతవైద్య విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. తరువాత పీజీ దంతవైద్య విద్యార్థుల కోసం 2016-17 విద్యా సంవత్సరంలో గుర్తింపు లభించింది. 2016-17 నుంచి ఇప్పటివరకు 8 బ్యాచ్‌ల్లో 112 మంది పీజీ దంతవైద్య విద్యార్థులు తమ కోర్సు పూర్తి చేసుకున్నారు. వైద్య రంగంలో అడుగుపెట్టాలని కలలుగన్న వందలాది మంది విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకుని దంత వైద్యులుగా సేవలందిస్తుండగా.. ఇంకొందరు తాజాగా వైద్యులుగా రాణించేందుకు పట్టాలు అందుకోనున్నారు.

నేడు 2018 బ్యాచ్ దంత వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం

- ప్రభుత్వ దంత వైద్య కళాశాల 2018 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం ఈనెల 10వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు కడప నగర శివార్లలోని విష్ణుప్రియ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న తెలిపారు.
- ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీకి మూడు పీజీ సీట్లు, ఓరల్ మాక్సిల్లోఫేసియల్ సర్జరీ విభాగానికి మూడు సీట్లు, పెరియోడాంటిక్స్ విభాగానికి మూడు పీజీ సీట్లు, ప్రాస్తోడాంటిక్స్ విభాగానికి రెండు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ 11 పీజీ సీట్లకు గాను భారతీయ వైద్య విద్యామండలి 2019 -20 సంవత్సరంలో గుర్తింపు ఇచ్చింది.
- డీసీఐ నిబంధనల ప్రకారం పెరిగిన పీజీ సీట్లకు అనుగుణంగా 2020-21 విద్యా సంవత్సరంలో అదనంగా 24 మంది బోధనా సిబ్బందిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయించారు.
- 2022-23 విద్యాసంవత్సరంలో భారతీయ విద్యామండలి ఓరల్ పెథాలజీ అండ్ మైక్రోబయాలజీ విభాగానికి మూడు పీజీ సీట్లు, కాన్సిక్వెన్షియల్(కన్సర్వేటివ్) డెంటిస్ట్రీ అండ్ ఎండోడాంటిక్స్ విభాగానికి మూడు సీట్లు, పీడోడాంటిక్స్ విభాగానికి మూడు సీట్లు, ఆర్థోడాంటిక్స్ విభాగానికి మూడు పీజీసీట్లు కొత్తగా మంజూరు చేసింది.
- దంతవైద్య సేవలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు దంతవైద్య సమస్యలపై అవగాహన కలిగించడం, పాఠశాలల్లో విద్యార్థులకు దంత సమస్యల నివారణ కోసం దంతవైద్య శిబిరాలను నిర్వహించడం లాంటి కార్యక్రమాలను వైద్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వైద్య శిబిరాలు పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ద్వారా జరుగుతాయి.

కళాశాలలో అభివృద్ధి ఇలా..

- డీసీఐ తమ పరిశీలనలో సూచించిన వైద్య పరికరాలను నిబంధనల మేరకు డీఎంఈ అనుమతితో సమకూర్చారు.
- ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) ద్వారా మరికొన్ని పరికరాల కొనుగోలుకు సంబంధిత కంపెనీలకు సరఫరా కోసం ఉత్తర్వులు పంపించారు.
- అదేవిధంగా ప్రభుత్వ బడ్జెట్‌లో దంత సమస్యలకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు.
- ప్రభుత్వం నుంచి వచ్చిన కోటి 11 లక్షల రూపాయలతో అవసరమైన చోట్ల భవనాలకు, చిన్న చిన్న మరమ్మతులు (నీటి, పారిశుధ్య, విద్యుత్) చేయించారు.
- దంతవైద్య కళాశాలలో సరిపడా 45 సీసీ టీవీ కెమెరాలను తరగతి గదులలో, విద్యార్థుల వసతి గృహాలలో ఏర్పాటు చేశారు.
- బోధనకు అవసరమైన ఎల్ఈడీ ప్రాజెక్టర్‌లను సమకూర్చారు.
- విద్యార్థులు స్వయంగా నిర్వహించుకునే విధంగా బాలుర వసతి గృహంలో మెస్‌ను ఏర్పాటు చేశారు.
- కళాశాల భవనంలో అందుబాటులో ఉన్న లిఫ్ట్‌లకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకువచ్చారు.
- ప్రభుత్వ కేన్సర్ హాస్పిటల్ నుంచి ప్రభుత్వ దంతవైద్య కళాశాలలోని ఓపీ, బాలుర, బాలికల హాస్టల్స్ వరకు మంచినీటి పైపులైన్‌ను ఏర్పాటు చేసుకునేందుకు కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, డీఎంఈ నుంచి అనుమతులను ఇటీవల పొందారు.
- ర్యాగింగ్ చట్ట వ్యతిరేకమని, ఆ నేరానికి విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.

వైద్య సేవలు ఇలా..

- ప్రభుత్వ దంత వైద్య కళాశాల ద్వారా ప్రతి రోజూ 100 నుంచి 150 మంది ఓపీ వైద్య పరీక్షల కోసం వస్తుంటారు.
- 2021 సంవత్సరంలో 26,525 మంది, 2022లో 29,235 మంది, 2023లో నవంబర్ వరకు 32,663 మంది దంత వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ దంతవైద్య కళాశాలకు వచ్చారు.
- కరోనా సమయంలో 'బ్లాక్ ఫంగస్'తో బాధపడుతూ వచ్చిన వారికి దవడ ఎముకలు, ఇతరత్రా ఆపరేషన్‌లను నిర్వహించారు. కృత్రిమంగా ఆర్బిట్స్‌ను అమర్చారు.

అందరి సహకారంతో అభివృద్ధి దిశగా అడుగులు



డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లా ప్రజలకు వైద్య రంగంలో అందించిన వరం కడప రిమ్స్ ఆవరణంలో స్థాపించిన ప్రభుత్వ దంతవైద్య కళాశాల. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక సహకారంతోనే పీజీ సీట్లు మరిన్ని పెరిగాయి. ఇక్కడికి దంతవైద్యం కోసం వచ్చే వారందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నాం. డీఎంఈతో పాటు, జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, జిల్లా అధికారులు, రిమ్స్, ప్రభుత్వ దంతవైద్య కళాశాలలోని వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది సహకారంతో కళాశాల దినదినాభివృద్ధి చెందుతోంది. – డాక్టర్ ఎం. జ్యోత్స్న, ప్రిన్సిపల్, ప్రభుత్వ దంతవైద్య కళాశాల, కడప.

నవశకం



గోరుముద్ద పథకం విద్యార్థులకు వరం



జగన్ మామయ్య వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో రక్తహీనత తగ్గించేందుకు రాగిజావ, కోడిగుడ్డు, చిక్కీ వంటి పోషకాహారం అందిస్తున్నారు. పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. దేశంలో ఇదో అద్భుతమైన కార్యక్రమం. మన రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే రాగిజావ, ఉడికించిన గుడ్లు పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేకంగా గోరుముద్ద పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం విద్యార్థులకు ఓ వరం.

– ఎమ్.రవికిరణ్, 10వ తరగతి, నీలకంఠ్రావుపేట, రామాపురం మండలం.

మా గ్రామంలోనే ధ్రువపత్రాలను పొందాను



గతంలో కులం, ఆదాయం ధ్రువపత్రాలను పొందాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకొని తహసీల్దారు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి ఉండేది. కార్యాలయంలో వీఆర్ఓ ఉంటే, ఆర్ఐ ఉండరు, వీరిద్దరూ ఉంటే తహసీల్దారు ఉండరు. దీంతో సర్టిఫికెట్లు చేతికి వచ్చే సరికే దాదాపు వారం, పదిరోజులు పట్టేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసిన మరుసటి రోజే సచివాలయానికి వెళ్లి తీసుకున్నాను. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టిన తరువాత వలంటీర్లు ఇళ్లవద్దకు వచ్చి ఆధార్, రేషన్ కార్డులు తీసుకొని పైసా ఖర్చు లేకుండా కులం, ఆదాయం సర్టిఫికెట్లను ఇస్తున్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాము.

– ఈరిశెట్టి లక్ష్మణ్ కుమార్, వెంకటాయపల్లి, సిద్దవటం మండలం

ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది



నేను పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాను. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో, కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇంటి కోసం హౌసింగ్ కార్యాలయాల చుట్టూ అనేకమార్లు తిరిగినా ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆయన చెప్పిన విధంగా అర్హులందరికి ఇల్లు కట్టించి ఇస్తున్నారు. జగనన్న కాలనీలో నాకు కూడా ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– అంజనమ్మ, రాజీవ్ కాలనీ, పులివెందుల

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వేంపల్లె : వేంపల్లె పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు కడపకు చెందిన విజిలెన్స్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రెడ్డప్ప, అసిస్టెంట్ జియాలజిస్ట్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద రెండు సుమో వాహనాలలో ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీలలో కదిరికి చెందిన ఇ.రవి, షేక్ అక్రంబాషాలు వేంపల్లె చుట్టుపక్కల గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా రవాణా చేస్తుండగా 36 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.1.90 లక్షలు ఉంటుందన్నారు. వాహనాలతో పాటు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వేంపల్లె మండల ఆర్ఐలకు అప్పగించామన్నారు. వీరిద్దరిపై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది జనార్దనరావు, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో ఆంధ్రా జట్టు


తలపడుతున్న ఆంధ్రా-గోవా జట్లు


వికెట్ పడ్డ ఆనందంలో ఆంధ్రా జట్టు

ఫాలోఆన్ ఆడుతున్న గోవా


అజన్ తోట (116 పరుగులు)


విజయ్ (6 వికెట్లు)


వాసు (3 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్-23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ పోటీలో ఆంధ్రా జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. ఆంధ్రా జట్టు 4 వికెట్ల నష్టానికి 606 పరుగులు చేసి డిక్లేర్ చేయగా, మూడోరోజు మంగళవారం గోవాజట్టు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించింది. గోవా జట్టు 79.2 ఓవర్లలో 226 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని అజన్ తోట 116 పరుగులు చేశాడు. ఆంధ్రా బౌలర్లు టి. విజయ్ 6 వికెట్లు, వాసు 3 వికెట్లు తీశాడు. అనంతరం ఫాలోఆన్‌లో భాగంగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 61 పరుగులు చేసింది. జట్టులోని అజన్ తోట 35 పరుగులు చేశాడు. ఆంధ్రా బౌలర్లు హేమంత్‌రెడ్డి 1 వికెట్ తీశాడు. దీంతో మూడోరోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి ఆంధ్రా జట్టు 319 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

అదృశ్యం కేసులపై దృష్టి పెట్టాలి

– జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : వివిధ పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న అదృశ్యం కేసులపై దృష్టి సారించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థతో పాటు హైకోర్టు ఆదేశాల మేరకు తప్పి పోయిన, అదృశ్యమైన పిల్లల కేసులను సమీక్షించేందుకు మంగళవారం కడపలోని జిల్లాకోర్టు న్యాయసేవాసదన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పిపోయిన, ఆచూకీ లభ్యంకాని పిల్లల కేసులను సమీక్షించి, వారిని గుర్తించడానికి అవసరమైన చర్యలు, వారి కుటుంబంతో వారిని తిరిగి కలపడం మొదలైన అంశాలపై చర్చించామన్నారు. పోలీస్ అధికారులు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులదే కీలకపాత్ర

రాయచోటి అర్బన్ : త్వరలో జరగనున్న ఎన్నికల్లో కమ్యూనిస్టులదే కీలకపాత్ర అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. రాయచోటిలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్యనేతల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీని నెత్తిన పెట్టుకోవాలని చూస్తున్న చంద్రబాబు ప్రజలకు ఎలాంటి సంకేతాలిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో చంద్రబాబు జతకట్టడం అంటే రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమేనని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలంటే ఇండియా కూటమి గెలవాల్సిందే అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ వైకుంఠరావు

ప్రొద్దుటూరు : శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం నిర్వహించిన 12వ అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల అసోసియేట్ డీన్ వైకుంఠరావు, ఓఎస్ఏ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు గన్నవరంలోని ఎన్టీఆర్ పశు వైద్య కళాశాలలో ఈ పోటీలు జరిగినట్లు తెలిపారు. బాలికల విభాగానికి సంబంధించి వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షెటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్ పోటీల్లో ఓవరల్ చాంపియన్ షిప్ దక్కించుకున్నారని తెలిపారు. బాలికల వ్యక్తిగత విభాగంలో థర్డ్ ఇయర్ విద్యార్థిని ఎం.సాయితేజశ్విని చాంపియన్ షిప్ సాధించిందన్నారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు అథ్లెటిక్స్ విభాగంలో, క్యారమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి చాంపియన్‌గా నిలిచారన్నారు. హైజంప్‌లో ద్వితీయ, ట్రిపుల్ జంప్‌లో తృతీయ బహుమతి సాధించారన్నారు. అలాగే బాలుర విభాగానికి సంబంధించి శివసాయి స్వరూప్ కెప్టెన్‌గా ప్రొద్దుటూరు జట్టు విజేతగా నిలిచిందన్నారు. 200 మీటర్ల పరుగు పోటీలో కె.విశ్వనాథ రెడ్డి తృతీయ బహుమతి, 4 ఇంటు 100 రిలే పరుగులో తృతీయ బహుమతి సాధించాడన్నారు. ఉపన్యాసంలో టి.మోహన్ ప్రథమ బహుమతి, వ్యాసరచనలో వి.గౌతమ్ శాలిని ద్వితీయ బహుమతి, డిబేట్‌లో పి.మోహన్, ఎస్.సురేంద్ర తృతీయ బహుమతి సాధించారని వివరించారు. క్విజ్ పోటీలో వి.రాధిక, ప్రజ్వల్ కుమార్ ద్వితీయ బహుమతి, దేశభక్తి గేయాల్లో హేమిమ తృతీయ బహుమతి, లలిత కళల్లో విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

కమర్షియల్ బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు సేవలు

ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : కమర్షియల్ బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు సేవలను అందిస్తోందని డీసీసీ, ఆప్కాబ్ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. డీసీసీ బ్యాంకు వ్యాపారం రూ. 3 వేల కోట్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో బ్యాంకు సీఈఓ. కందుల రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి బ్యాంకు సిబ్బందితో సంబరాలను నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాను చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన 2021 సంవత్సరంలో రూ.13 వేల కోట్లు టర్నోవర్ ఉన్న బ్యాంకు లావాదేవీలను నేడు రూ. 3 వేల కోట్లకు పెంచామన్నారు. ఒకప్పుడు ఇది రైతుల బ్యాంకుగా మాత్రమే పేరు ఉండేదని ఇప్పుడు కమర్షియల్ బ్యాంకులతో సమానంగా అన్ని రకాల రుణాలను అందిస్తోందన్నారు. ప్రస్తుతం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 24 బ్రాంచులు ఉన్నాయని మరో నాలుగు కొత్త బ్రాంచులను ఆర్‌బీఐ మంజూరు చేసిందన్నారు. దీంతో పాటు రైతులకు పంట దిగుబడులను దాచుకునేందుకు వీలుగా నాబార్డు సహకారంతో జిల్లాలో 18 గోడౌన్లను నిర్మిస్తున్నామన్నారు. బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ బ్యాంకులో ఏవైనా సమస్యలు ఉన్నా, ఎవరైనా డబ్బులు అడిగినా 9966494211 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు వీరారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గంగాద్రి, బ్యాంకు సలహాదారు సహదేవరెడ్డి, బి.కోడూరు సహకార సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.